# అదృష్టదేవత

కొమ్మూరి ఉషారాణి (భాటియా)

"ప్రియమైన సుందరంకి,

ఈమధ్య నువ్వు తరచుగా జ్ఞాపకం వస్తున్నావు. నువ్వు నాపక్కన లేకున్నా, నీ మూర్తి నావెంట వుండి, ఈ దుఃఖ సమయంలో నన్ను ఊరడిస్తున్నట్లే వుంది. నా మనసులో రగులుతున్న ఈ ఆవేదన, ఎన్నటికీ చల్లారదేమో అన్న ఈ అగ్ని, ఎలా సమసి పోవాలో నాకు పాలుపోవటం లేదు. నీకూ నాకూ మధ్య వున్న స్నేహం, ఆత్మీయత మామూలుది కాదు. నా పరిస్థితి అర్థం చేసుకుని, తగు సలహా ఇస్తావనే ఆశతో ఈ ఉత్తరం రాస్తున్నాను.

"మా కుటుంబ పరిస్థితులు నానాటికీ చాలా విచిత్రంగా రూపొందుతున్నాయి. డబ్బులేమి అను, మధ్యతరగతి కుటుంబీకులు సామాన్యంగా ఎదుర్కొనే అసంతృప్తి అను. సహ అపేక్షలు లోపించటం అను, మాలో ఒకరి మధ్య ఒకరికి గోడలు ఏర్పడుతున్నాయి. జీవితంలోని ఒక్కో సంఘటనా, సుఖ దుఃఖాలు ఒకర్ని ఒకరికి దగ్గరగా చేర్చటం పోయి అగాధాలు ఏర్పడుతున్నాయి. మాలో మాకు వున్న

ఈ పొరపొచ్చాలకి తోడు, అన్నయ్య ఈమధ్య ఒక కొత్త సమస్యని తీసుకువచ్చాడు మా మధ్యకి.

ఎవరో అనాథ బాలికట, చిన్నప్పుడే తల్లి దండ్రుల్ని పోగొట్టుకుంది. పెత్తండ్రి పెంపకంలో అష్టకష్టాలు పడి, చివరికి జీవితం పెట్టే పరీక్షలో నెగ్గలేక, అథోపాతాళానికి దిగజారిన పిల్లని ఇంట చేర్చాడు. పిల్ల బుద్ధిమంతురాలు. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. ఆ పిల్లని సంస్కరిద్దామనో, ఆశ్రయం కల్పిద్దామనో అన్నయ్య ఏ ఉద్దేశంతో ఇంట చేర్చాడోగానీ వాటి పరిణామాలు మటుకు చాలా దారుణంగా తయారయాయి. ఆ పిల్లని వంట ఇంట్లో చేర్చరాదని బామ్మ గోల, కుర్చీలో కూర్చో రాదని ఒదిన రూలు, దేవుడి గదిలో ప్రవేశిస్తే అంటు అని అమ్మ కేకలు. ఇంట్లో ఆడవాళ్లు ఆ పిల్ల బ్రతుకు భరింపరానిదిగా తయారుచేస్తున్నారు. ఈ మాటలు, పోట్లు ఒకమూల ఇలా వుండగా, స్కూల్లో చేర్పిస్తామనీ, అనాథ స్త్రీ శరణాలయంలో రికమెండు చేస్తామనీ, రోజుకొకరు ఇంటి చుట్టూ తిరిగిపోయే సంఘసంస్కర్తలు, పెద్ద మనుష్యులు ఎక్కువయిపోతున్నారు. ఆ పిల్ల దేనికీ ఉలకదు, పలకదు. తన భవిష్యత్తుని, తానే నిర్ణయించుకోగల ననే ఆత్మవిశ్వాసం, ధైర్యం, తుదకి తిట్లకీ, సూటిపోటి మాటలకి చలించే ఉద్రేకం సయితం కోల్పోయిన ఆ రాతి బొమ్మని చూస్తే నా గుండె తరుక్కుపోతోంది.

"ఈ ఇంట్లో ఆపిల్ల ఎలా అన్నం తింటుందో, నిద్రపోతోందో నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఆ పిల్లకేసి చూస్తేనే పెద్ద అన్యాయం జరుగుతున్నట్లు బాధగా వుంది. ఈ నరక కూపం నుంచీ, వాతావరణం నుంచీ ఆమెనెలాగైనా రక్షించాలని వుంది. నేను ఇంకా చదువుకుంటున్నాను. అస్వతంత్రుణ్ణి. ఆ పిల్లకి సహాయపడాలనే కోరిక వుందిగానీ అది ఎలా నెరవేరగలదో తెలియని స్థితిలో వున్నాను. నన్నుఏం చేయమంటావు? నీవేమయినా సహాయం చెయ్యగలవా?"

సుందరం స్నేహితుడి ఉత్తరం జేబులో పెట్టుకుని సిగరెట్ ముట్టించాడు. భాస్కరం ఎప్పుడూ ఇంతే! చిన్నప్పటి నుంచీ ఉద్రేకం, సెంటిమెంట్లు గల వ్యక్తి. కొన్ని విషయాలను దులిపేసుకునే స్వభావం లేదు, చిన్న విషయాలనే పెద్ద విషయాలుగా ఊహించుకుని తనమీద వేసుకుని బాధపడిపోతూ వుంటాడు. చదువుకుంటూ, హాయిగా, నిశ్చింతగా జీవితం గడపాల్సిన ఈ వయసులో ఈ గొడవ ఏమిటి? ఒక అనాథ బాలికని రక్షించబోవటం ఏమిటి? కొంపదీసి ఆ పిల్లని ఇతడు ప్రేమించటం లేదు కదా...! ఇదీ ఒక సమస్యే?... సుందరం పడ కుర్చీలోంచి లేచి గడియారం చూసుకున్నాడు. అప్పుడే తొమ్మిదయింది. ఇంకో అరగంటలో రైలు ప్లాటుఫారం మీదికి వస్తుంది. రంగడ్ని పిలిచి వెంటనే టాక్సీ పట్రమ్మన్నాడు.

అనుకున్నదానికంటే ఓ అరగంట ఆలస్యంగా వచ్చింది రైలు. సెకండు క్లాసు కంపార్టుమెంటులో అట్టే రద్దీ లేదు. పరుపు పర్చుకుని, దినపత్రిక, శంకర్సు వీక్లీ, ఫిలింఫేరు ముందు వేసుకుని, కిటికీ లోంచి బైటికి చూశాడు సుందరం... అతని ఆలోచనలు ఆ పరిసర ప్రాంతాల నుంచీ, భాస్కరం ఉత్తరం నుంచీ కొన్ని వందల మైళ్లు దూరం పరుగెత్తింది.

పచ్చని పొలాలు, నీలాకాశం, నల్లని కొండలు, అక్కడక్కడా వైర్‌లెస్ తీగెల మీదుగా ఎగిరే రంగు రంగుల పిట్టలూ... ప్రకృతి సౌందర్యాన్ని తనివి తీరా చూస్తూ, ఆ పొలాల మధ్య, రంగుల మధ్య తన జీవిత స్వప్నాన్ని చిత్రించుకున్నాడు సుందరం. మద్రాసులో ఓ చిన్న ఇల్లు, ఆ ఇంటి ముందు చక్కని పూలతోట, ఆ తోటకి నీళ్లు పోస్తూ ఓ కూలీ, ఆఫీసు నుంచి అలసి తిరిగివచ్చిన తనని చిరునవ్వుతో పలకరించే అర్థాంగి... జీవితంలోని ఒక్కో మధుర ఘట్టం కళ్ళముందు నాట్యమాడింది. రూపం, విద్య, సాంప్రదాయం గల చక్కని భార్య, మంచి ఉద్యోగం, కొండంత భవిష్యత్తు. ఏ వ్యక్తి అయినా ఇంతకంటే కోరుకునేది ఏముంది?...

పెళ్లిచూపులకి వెళ్ళినప్పుడే పార్వతి అంటే అమ్మ ఎంతో ఇష్టపడింది. ఇక నాన్న సరేసరి! వెంటనే ముహూర్తం పెట్టించాలన్నాడు. ఉభయ పక్షాల పూర్తి అంగీకారంతో నిశ్చయమయింది సంబంధం... ఓ నెల తిరక్కముందే తనకి ఉద్యోగం వచ్చింది. అరె! పిల్ల అదృష్టమనుకున్నారు అంతా... సుందరం ఖాళీ సిగరెట్ పెట్టె కిటికీలోంచి బైటికి విసిరేశాడు. కొత్త పెట్టె తెరిచాడు. ఆ క్షణంలో గాల్లో ఎగురుతున్న సెలుఫూన్ పేపరు ఎంతో అందంగా కనిపించింది సుందరం కళ్ళకి... తను ఉద్యోగంలో చేరబోతున్నాడు... పార్వతికి అతి సన్నిహితంగా వెలుతున్నాడు... ఇక పెద్దల ఆశీర్వాదం కొరకు మాఘమాసం వరకూ వేచి వుండాలి... అరె! రైలు ఇంత నిమ్మళంగా వెలుతోందేం? ఈవేళ పొద్దు ఎక్కువేమీ చెప్పా మద్రాసు మొత్తానికి చాలా దూరమే - ఇలాటి ఆలోచనలతోనే సతమతమయాడు సుందరం. అతనిలో రేగిన ఆతురత, ఉత్సాహం అలాంటివి ఆ సమయంలో.

* * *

రాయపేటలో మేనమామఇంట్లో మకాం - కొత్త ఉద్యోగం, సాయంత్రంపూట పార్వతి ఇంటికి షికార్లు, ఆదివారాలు సినిమాలు, బీచీ, జీవితం మధురంగా, అతి మధురంగా గడిచిపోతూంది. సుందరానికి అప్పుడప్పుడూ పాంటు జేబుల్లోనూ, పెట్టె అడుగునా భాస్కరం ఉత్తరం అడ్డువచ్చేది. ప్రియ స్నేహితుడికి జవాబు రాయలేదనే బాధ మనసుని పీకేది. కానీ దానికి తగిన మూడ్ లేదంటూ వాయిదా వేస్తున్నాడు.

* * *

క్యాలెండర్ పేజీలు గిరగిర తిరుగుతున్నాయి. మాఘమాసం దగ్గిరపడుతూంది. పార్వతి సుందర రూపం, వంకర్లు తిరిగిన ఒత్తయిన జుత్తు, తీగెలాటి శరీరం, మత్తెక్కించే కళ్ళు, ఒళ్లు పులకరింపజేసే చిరునవ్వు - వీటన్నిటితో బాటు పార్వతి హృదయం, ఆ హృదయం వెనక దాగివున్న ఆలోచనల పరంపరలు కొద్దికొద్దిగా అవగాహన అవుతున్నాయి సుందరానికి. ఆమెని రోజూ కలుస్తున్నాడు, షికారుకు వెళుతున్నాడు. రంగు రంగు చీరల్లో, అలంకరణలలో అందాలు ఒలకబోస్తూ ముగ్ధుణ్ణిచేస్తూ పార్వతి అతనికి మానసికంగా కూడా చాలా దగ్గిరగా రాగలిగింది.

ఆమెయందు అతడికి గల ఆకర్షణ హెచ్చవుతూంది. కానీ దానితోబాటు అతని మనసులో ఏదో ఆందోళన, అర్థం కాని అసంతృప్తి అలముకుంటున్నాయి. అంతేకాదు; ఒక్కొకప్పుడు పార్వతి అతన్ని ఆశ్చర్యచకితుణ్ణిగా చేస్తుంది. "మా నాన్నగారు ముందే చెప్పారు. మీకు మంచి ఉద్యోగం దొరుకుతుందని. నేను ఎప్పుడూ - నా సెలక్షన్‌లో తప్పు చేయను. మీరు అందంగా వున్నారని నా స్నేహితులు ఎగ్రీ అయారు" అన్నది నవ్వుతూ. ఈ విషయాన్నే ఇంకో విధంగా, సున్నితంగా అనివుంటే బాగుణ్ణు అనిపించింది సుందరానికి.

"నాకు మొదట్నుంచీ వివాహం గురించి ఇద మిద్ధమైన కొన్ని అభిప్రాయాలున్నాయి. అందం, డబ్బు, హోదా ఇలా నా మనసుకి అనువైంది ఏరుకుని, అవి వున్న వ్యక్తిని వివాహమాడాలని నిశ్చయించుకున్నాను. నా ఆశ నెరవేరింది" అన్నది ఇంకో రోజు. "ఏ ఆశ?" అని అడగాలనిపించింది సుందరానికి, కానీ వెంటనే మనసుని నిలద్రొక్కుకున్నాడు.

ఇంకో రోజు భాస్కరాన్ని గూర్చి ఉపోద్ఘాత మిచ్చి, అతని ప్రస్తుత సమస్యని విడమర్చి,

"ఏమంటావు?" అన్నాడు సుందరం ఆతురతతో. "ఆ! అంతా ఒట్టి నాన్సెన్సు. ఈమధ్య మన సొసయిటీలో ఇలాటి కేసులు ఎక్కువయాయి. అనాథ శరణాలయాలు, సంక్షేమ కేంద్రాలూ వున్నాయి కదా అని ఇలాటివాళ్లు కొల్లలుగా తయారవుతున్నారు" అతి చులాగ్గా తేల్చేసింది పార్వతి. సుందరం మనస్సు ఎందుకో చివుక్కుమంది.

"ప్రేమా గీమా నాకు నమ్మకం లేదు. నేను చాలా ప్రాక్టికల్ మనిషిని" అన్నది ఇంకో రోజు మాటల సందర్భంలో. ఆ మాటతో సుందరం తల దిమ్మెక్కినట్లయింది. అతని చేతిలోంచి ఏ అదృష్ట దేవతో జారిపోతున్నట్లనిపించింది.

తన అభిప్రాయాల బరువు, దృక్పథం సుందరంలో ఎలాటి ప్రభావం కలిగిస్తుందో, అతనిలో ఎలాటి మార్పును కలిగిస్తున్నదో ఆగి ఆలోచించ లేదు పార్వతి. తన చక్కదనంతో, ఎక్కాంప్లిషమెంట్సుతో అతన్ని మంత్రముగ్ధుణ్ణి చేస్తున్నాననే నమ్మికతో ఆమె ముందుకి వెళ్ళిపోయింది. కానీ సుందరం తనకి చాలా గజాల వెనక నిలబడిపోయాడని తెలుసుకోలేదు ఆమె.

సుందరంలో సంభ్రమాశ్చర్యాలు లేవు ఇప్పుడు. జీవితం పట్ల ఒక విధమైన నిర్లిప్తత, అసంతృప్తి కావు అవి. ఎవరికీ చెప్పుకోలేని, చెప్పరాని ఆవేదన అది. తన జీవితస్వప్నం ఎలా ఎందుకు కూలిపోయిందో, ఎవరికీ అర్థం కాని ఒక భరింపరాని ఆవేశం... మనసుని ముక్కలు ముక్కలుగా చేసే దిగులు. తను ఎక్కడ పొరబాటు చేశాడో, జీవితాన్ని ఈ భయంకర స్థితి నుంచి ఎలా కాపాడుకోవాలో తెలియలేదు అతనికి.

సుందరం ఇప్పుడూ కలత నిద్రతో బాధపడుతున్నాడు. స్వప్నాలు కంటున్నాడు. ఆ కలల్లో పచ్చని పైరులూ, రంగు రంగుల పిట్టలూ, అతి రూపవతి అయిన భార్యా లేరు. బీచిలో అలల

వైపుగా నడిచివస్తున్న పార్వతి, ఆమె చెతిప్రేళ్ళ నాజూకుతనం అతన్ని ఉక్కిరి బిక్కిరి చేయటం లేదు. తన భావాలలో లీనమై, తన మనసు విశాలంలో ఓ పక్క పంచుకుని, తన ఉద్రేకాల పట్ల సానుభూతి చూపుతున్న ఒక స్త్రీ నిలిచి వుంది. ఆమె సౌందర్యం, లాలిత్యం అతని కళ్ళకి మసక మసకగా కనుపిస్తున్నాయి. కానీ ఆమె కళ్లల్లో ప్రేమ జ్యోతి అఖండంగా వెలుగుతోంది. దయా కరుణలతో పొంగిన ఆమె హృదయం అతనికి లీలగా గోచరించింది. ఎలాటి జీవిత సత్యాన్నయినా ఎదుర్కొనగలిగే మనస్థయిర్యం ఆమె మాటల్లో ప్రస్ఫుటమయ్యాయి... కల కరిగింది. సుందరం కళ్లు తెరిచాడు. కానీ ఆ కలల మాటున దాగివున్న తీవ్రమైన వాంఛ అతన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

సుందరం! నువ్వు అదృష్టమంతుడివోయ్."

"సుందరం! మీ తల్లి నోము ఫలించింది."

"నీకేం తక్కువోయ్, అరచేతిలో స్వర్గం వుంది."

ఎక్కడికి వెళ్ళినా, ఏ వైపు తిరిగినా అతని చెవులకి హెూరెత్తించేవి ఈ మాటలు. ఆ కాసేపు అతనికి ఆనందంగా వుండేది. "అవును కామోసు! ఎందుకు కాదు!" అనుకునేవాడు. కానీ ఆ ఆనందం తాత్కాలికమైనదే. 'ప్రపంచం గుడ్డిది' అనిపించే సంఘటనలు అనేకం ఎదురయ్యేవి అతనికి. అలా రోజులు, వారాలు బరువుగా తోస్తున్న సుందరానికి ఓరోజు భాస్కరం దగ్గిర్నుంచి మళ్ళా వుత్తరం వచ్చింది.

"ప్రియమైన సుందరంకి,

నీ వుత్తరం అందినప్పటి నుంచీ ఎప్పటికప్పుడు సమాధానం రాయాలని, కానీ సంకోచిస్తూ వుండిపోయాను. లేనిపోని బాధ్యతలన్నీ పైన వేసుకుని బాధపడవద్దనీ, ఈ సమస్యని ఇంట్లో పెద్దలకే వదిలెయ్యమనీ రాశావు. నా క్షేమం కోరి, నామీద వుండే అభిమానం కొద్దీ నువ్వు ఇచ్చిన సలహాకి కృతజ్ఞుణ్ణి. కానీ దాన్ని పాటించలేకపోయినందుకు చాలా విచారిస్తున్నాను, నేను రాయబోయే విషయాలు నీలో ఎలాటి అనుభూతులు కలిగిస్తాయో తెలియదు. తప్పో, ఒప్పో నన్ను అర్థం చేసుకోగలవాడివి నువ్వొక్కడివే అని నీకీ వుత్తరం రాస్తున్నాను.

"నీకు పోయినమాటు ఆ జాబు రాశాక, ఇంట్లో పరిస్థితులు చాలా విషమించాయి. ఆ పిల్ల జీవితం దినదినగండమయిపోయింది. తన స్కూలులో ఉచితంగా విద్య నేర్పుతాననే మిష మీద ఓ పెద్ద మనిషి ఆమె జీవితాన్ని మరింత దుఃఖభాజనం చేయ ప్రయత్నించాడు. ఆ రాత్రికి రాత్రే ఆమె గోలుగోలున ఏడుస్తూ మా వాకిట ముందు వాలింది. ఆమెని వివాహం చేసుకుని సంస్కరిస్తానని ఓ యాభై సంవత్సరాల "బాలుడు" అతి దయార్ద్ర హృదయంతో ముందుకు వచ్చాడు. ఇంట్లో అందరూ, చివరికి అన్నయ్య కూడా అంగీకరించేందుకు సిద్ధమయ్యారు. కానీ నేను ఆ దారుణాన్ని జరగనివ్వలేను.

"నిండా ఇరవై సంవత్సరాలన్నా లేవు. ప్రతి కదలికలో, చూపులో భయాందోళనలు ద్యోతకమవుతూ, జీవితంలో ఎదురైన దెబ్బలకి దైన్యంతో కుమిలిపోతున్న ముఖం - ఆమె చేసిన పాపం ఏమిటి? కొందరు స్వార్థపరులకి ఎర అయి, సంఘం ఏర్పరచిన నియమాలను ఉల్లంఘించింది. అందరిచేతా అసహ్యించుకుని, జాలిపడవలసిన ఘోర స్థితికి వచ్చింది.

"కొన్ని సంఘటనలు ఎందుకు సంభవిస్తాయి? కొందరు వ్యక్తులు ఎందుకు అలా ప్రవర్తిస్తారు? అనే విషయాలని లోతుగా ఆలోచించే ధైర్యం, శక్తి లేవు మనలో. జరిగిపోయిన సంఘటనల తప్పొప్పులు నిర్ణయించి కాలయాపన చేసే బదులు, భవిష్యత్తుని గూర్చి ఆలోచిస్తే మంచిది. దీనికి స్వచ్ఛంద హృదయం, కార్యదీక్ష, కరుణ ఎంతో అవసరం. ఒకర్ని మనం సంస్కరిస్తున్నామనే అహం, కాఠిన్యం ఏ కోశాన వున్నా మనం తలపెట్టే కార్యం సఫలం కాదు. నా ఉద్దేశం, ఇలాటి చిక్కులు ముడిపడటం వల్లనే ఆ పిల్ల సమస్యని ఇక్కడ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. అంతేకాదు, సంస్కరణ పేరుతో వున్న స్థితిని మరింత దుర్భరం చేస్తున్నారు.

"ఈ పై ఆలోచనలతో కలత చెందుతున్న నేను ఒక దృఢ నిశ్చయానికి వచ్చాను. ఆమెను ఒక స్త్రీ సంక్షేమ కేంద్రంలో చేర్చే ఏర్పాట్లు చేశాను. రెండు సంవత్సరాల పాటు అక్కడ ఆమెకి కుట్లు, చేతిపనులలో తర్ఫీదు ఇస్తారు. కొద్దిగా చదువు కూడా చెబుతారు. వసతి, భోజనం ఉచితం. ఈ తర్ఫీదు పూర్తయాక ఆమెకు స్వతంత్ర జీవనోపాధి చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ ఏర్పాట్లన్నీ ఆమెనక్కడ చేర్చేముందు, ఇంటా బయటా కూడా నామీద అక్షింతలు చల్లినవారే. 'పిల్లల్ని పట్టుకునే ఆయా కిందయినా ఉండేది. మధ్యనక్కడ ఎందుకు' అని మూతి విరిచింది ఒదిన. 'అంట్లు తోముతూ పై పనికి సహాయంగా వుండేది' అంటూ వాపోయింది అమ్మ "మీవాడేమిటి? ఆ పిల్లనేసుకుని తెగ తిరుగుతున్నాడు!" అని నాన్న చెవులు కొరికారు చుట్టాలు, స్నేహితులు.

"చేతి గడియారం అమ్మేసి, ఆమెని తీసుకుని, విజయవాడ రైలు ఎక్కేసరికి నాకూ నా కుటుంబానికి మధ్య వున్న సంబంధం పూర్తిగా తెగిపోయింది. ఆమెని లేవదీసుకుపోతున్నాననీ, తల్లితండ్రులకి కృతఘ్నుడననీ, పెద్దలయందు భయభక్తులు లేక చెడిపోయాననీ నిర్ణయించింది లోకం.

"నాకు ప్రస్తుతం ఇవేమీ అంటవు. ఈ ఊళ్లోనే ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం సంపాయించాను. నా సంపాదనలో ఆమె పై ఖర్చులకి నెలకి ఓ ఇరవై రూపాయలు పంపుతున్నాను. సాయంకాలాలు ప్రయివేట్లు చెబుతున్నాను. వారానికి రెండు సార్లయినా ఆమెని వెళ్ళి చూసివస్తూంటాను.

"నాకు ఈ ఊళ్ళో స్నేహితులనబడే ఘరానా పెద్ద మనుష్యులు, చుట్టాలూ బొత్తిగా లేరు. ఒకవేళ వున్నా వాళ్ళు నన్ను చూసి ముఖం తిప్పేసుకుంటారు. వాళ్ల ఇళ్ళల్లో నేను అడుగుపెట్టటం కాదు కదా, వీధిలో పలకరించేందుకే సిగ్గుపడతారు పాపం. ఇలా తెగతెంపులు చేసుకు వచ్చేసినందుకు, మందలిస్తూ అన్నయ్య మటుకు ఓ ఉత్తరం రాశాడు. ఒక్క బరువైనా భుజాల నుంచి దిగిపోయినందుకు అన్నయ్య సంతోషం అన్నయ్యది. ఆ ఉత్తరం మినహా మరి ఇంటి విషయాలు నాకేమీ తెలియవు.

"నాకు ఈ జీవితంలో ఏ అసంతృప్తి, దిగులూ లేదు. పైపెచ్చు బోలెడంత ఆత్మవిశ్వాసం, ధైర్యం చేకూరాయి. వీటితోబాటు ఓ మధురమైన అనుభూతి కూడా నా జీవితాన్ని పునీతం చేసింది. నేను లలితని... ఆమెని... ప్రేమిస్తున్నాను. ఈ విషయం ఆమెకింకా తెలియదు. ఈ రెండు సంవత్సరాలూ ఆమెకు ఆర్థికంగానూ, ఇతరత్రా సహాయపడే ఒక స్నేహితుణ్ణి మటుకే నేను. తరువాత నా భాగ్యం ఫలిస్తే ఆమెను అర్ధాంగిగా చేసుకోవాలని. నన్ను పూర్తిగా విశ్వసించి, తన జీవితపుటలని యావత్తు నా ముందుంచి, గౌరవాభిమానాలతో నన్ను పలకరించే లలిత - 'ప్రేమ' అనే పదానికి గల నిర్వచనం, విలువ యావత్తు ఆమెలో చూడగలిగాను.

"ఇంతకంటే ప్రస్తుతం ఇంకేం రాయలేను. నీ సహకారం, ఆశీర్వాదం ఎల్లప్పుడూ లభిస్తుందనే ఆశతో - భాస్కరం."

చెమ్మగిలిన కళ్లతో ఉత్తరం మడిచాడు సుందరం. అవి ఆనందభాష్పాలు. ప్రియ స్నేహితుడి సాహసానికీ, మనోధారుఢ్యానికీ, కరుణ హృదయానికి మురిసిపోయింది మనసు. కానీ ఎందుకో కొద్దిగా కలత చెందింది కూడాను. లలిత... ఎవరు?... ఎలా వుంటుంది?... "ప్రేమ" అనే పదానికి గల నిర్వచనం, విలువ యావత్తు ప్రస్ఫుటం చేసే వ్యక్తి... సుందరం ఆ పంక్తిని పదేపదే చదువుకున్నాడు. తన చేయి జారిపోయిన అదృష్టదేవత... కాదు ప్రేమ దేవత స్నేహితుణ్ణి దీవించింది... ఆ క్షణంలో భాస్కరం కంటే భాగ్యవంతుడు మరొకడు కనిపించలేదు సుందరంకి. ❋

['యువ' ఫిబ్రవరి 1961 సంచిక నుంచి]

ఆస్ట్రేలియాలో కెంర్న్ సముద్రతీరాన నడిచే జనం మీద, కాస్త గాలివీస్తే చాలు, కొబ్బరికాయలు రాలిపడుతున్నాయట. ఈ సమస్యకి సహాయం కోతులు చేయగలవని ఆశించి, ఈ బీచ్‌లో కోతుల్ని వదలటానికి నిశ్చయించుకున్నారు సదరు పాలకులు. 'కోతీ - కొబ్బరికాయ' అన్నది మనకు తెలిసిందే కదా! పండిన కొబ్బరికాయలు మాత్రమే కోతులు రాలుస్తాయా? అవి మనుషుల మీద పడకుండా కొబ్బరి బొండాల్ని రాలుస్తాయా? లేక మరొక సమస్య కొత్తది తెచ్చిపెడతాయా?

- ఎస్.ఎల్. విద్య